**<u>వినతి పత్రం</u>**

**తెలంగాణ ప్రజలకు అపార నష్టం కలిగించే విధంగా కృష్ణ, గోదావరి నదులపై ప్రాజెక్టులను స్వాధీనం చేసుకుంటూ 15 జులై 2021న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గెజెట్ నోటిఫికేషన్ ను తక్షణం ఉపసంహరించుకోవాలని అభ్యర్థిస్తూ వినతి పత్రం**

**తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరమ్**

---

**విషయ సూచిక**

**________________**

**ముందుమాట**

**_______________**


**మొదటి అధ్యాయం: సమస్య**

**రెండో అధ్యాయం: ఆంధ్రప్రదేశ్ విభజనకు దారితీసిన కారణాలు ఏమిటి?**

**మూడో అధ్యాయం: తెలంగాణ రాష్ట్రం అవరించిన తర్వాత తలెత్తిన సమస్యలు**

**నాలుగో అధ్యాయం: 15 జులై 2021న కేంద్రం విడుదల చేసిన అక్రమ గెజెట్ నోటిఫికేషన్**

**అయిదో అధ్యాయం: గెజెట్ నోటిఫికేషన్ అమలు జరిగే సంభవించే ప్రమాదభూయిష్టమైన పరిణామాలు**

**ఆరో అధ్యాయం: గెజెట్ నోటిఫికేషన్ ఎట్లా రాజ్యాంగవిరుద్ధం?**

**ఏడో అధ్యాయం: ప్రార్థన**

**భారత రాష్ట్రపతి మహోదయా,**

**న్యూదిల్లీ**

**గౌరవనీయులైన రాష్ట్రపతి మహోదయా,**

**విషయం:** కృష్ణ, గోదావరి నదులను స్వాధీనం చేసుకుంటూ 15 జులై 2021న కేంద్రం జారీ చేసిన గెజెట్ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవాలనే విన్నపం.

---

**రిఫరెన్స్:** 15 జులై 2021న కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్.

---------

**మొదటి అధ్యాయం: సమస్య**

కృష్ణా, గోదావరి నదుల నీటి నుంచి తెలంగాణ ప్రజల సాగునీరూ, తాగు నీరూ అవసరాలను తీర్చడానికి సంబంధించిన విషయాన్ని తెలంగాణ సమాజానికి చెందిన **మేము తెలంగాణ అభివృద్ధి వేదిక (తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరమ్)**తరఫున మీ దృష్టికి అత్యవసరంగా తీసుకురాదలిచాము. దాహార్తితో పిడచకట్టుకుపోయిన తెలంగాణ ప్రజల గొంతుకలనూ, బీటలువారిన భూములనూ కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా మనవి చేస్తున్నాం. దయజేసి ఈ కింద పొందుపరచిన ముఖ్యమైన అంశాలను పరిశీలించండి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం కలిగించే (ముఖ్యంగా తెలంగాణను దారుణంగా దెబ్బతీసే) **గెజెట్ నోటిఫికేషన్** ను  కేంద్ర జలశక్తి (నీటి వనరుల

అభివృద్ధి, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవనం) మంత్రిత్వశాఖ **15 జులై 2021న** జారీ చేసింది. 15 జనవరి 2022న ప్రకటించిన కార్యక్రమం (షెడ్యూల్) ప్రకారం ఈ నోటిఫికేషన్ కనుక అమలు జరిగితే కృష్ణ, గోదావరి నదులపైన ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులపైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నియంత్రణను పూర్తిగా కోల్పోతాయి. ఆస్తులన్నీ కేంద్ర ప్రభుత్వం రివర్ బోర్డుల ద్వారా స్వాధీనం చేసుకుంటే ప్రాజెక్టుల నిర్మాణానికి బ్యాంకుల నుంచీ, ఇతర సంస్థల నుంచీ తీసుకున్న వేలాది కోట్ల రూపాలయ అప్పుల భారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నెత్తిన పడుతుంది. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వ నదులపైన ఉన్న ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడం ఎన్నడూ కనీవినీ ఎరుగని అసాధారణ చర్య. ఇది రాజ్యాంగ విరుద్ధం, అక్రమం, అన్యాయం, ఏ మాత్రం సమర్థనీయం కాని ఏకపక్ష నిర్ణయం. ఇటువంటి అన్యాయమైన గెజెట్ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవాలని ఈ విజ్ఞాపన పత్రం ద్వారా అభ్యర్థిస్తున్నాం.

## రెండో అధ్యాయం: రాష్ట్ర విభజనకు దారితీసిన కారణాలు ఏమిటి?

## తెలుగు రాష్ట్రాలూ, వాటి నదులూ

రెండు మహానదులు - కృష్ణ, గోదావరి - ఎగువ రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ప్రవహించి, తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ కు వెళ్ళి, ఆ తర్వాత బంగాళాఖాతంలో విలీనం అవుతాయి. ఇతర రాష్ట్రాలతో పాటు ఈ రెండు నదుల నీటిపైన రెండు తెలుగు రాష్ట్రాలకు ఎవ్వరూ కాదనలేని అధికారం ఉన్నది.  పొరుగు రాష్ట్రాలతో ఉన్న వివిదాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సైతం నదీజలాల పంపిణీ విషయంలో అభిప్రాయ భేదాలు ఉన్నాయి. ట్రిబ్యూనళ్ళు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన వాటాలో తెలంగాణ, సీమాంధ్ర ప్రాంతాల మధ్య వాటాల విషయంలో వివాదాలు ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి దారితీసి, దాన్ని ఉధృతం చేసిన కారణాలలో నదీజలాల పంపిణీలో అన్యాయం ప్రధానమైనది. తెలంగాణకు రావాల్సిన వాటా రాకపోవడంతో సరిహద్దు జిల్లా అయిన మహబూబ్ నగర్ బాగా వెనకబడిపోయింది. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూలీలను (పాలమూర్ లేబర్)ను సరఫరా చేసే జిల్లాగా పేరుమోసింది. ఫ్లోరైడ్ నీరు తాగి

అంగవైకల్యాలతో నల్లగొండ జిల్లా ప్రజలు తరతరాలుగా నరకయాతన అనుభవిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆంధ్రపాలకులు రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రాజెక్టులు తలపెట్టలేదు. కృష్ణ, గోదావరి జలాలను ఆంధ్రప్రాంతాలకు తరలిస్తూ తెలంగాణ జిల్లాలను ప్రకృతి కరుణాకటాక్షానికి వదిలేశారు. తెలంగాణ ప్రాంతం ఒక విచిత్రమైన సమస్యను ఎదుర్కొంటూ ఉండేది. నదులు తెలంగాణ భూభాగం నుంచి ప్రవహిస్తాయి కానీ తెలంగాణేతరులైన ఆంధ్రపాలకుల స్వార్థ చింతన కారణంగా తెలంగాణ ప్రజల దాహార్తినీ, పొలాల నీటి అవసరాలను తీర్చవు.

ఆంధ్ర రాష్ట్రాన్ని 1953లో  మద్రాసు ప్రావిన్స్ నుంచి విభజించిన తర్వాత ఆ రాష్ట్ర నాయకులు తెలంగాణ ప్రాంతంతో కలసి విశాల ఆంధ్రప్రదేశ్ ను ఏర్పాటు చేయడంలో చొరవ తీసుకోవడానికి కారణం దక్కన్ పీఠభూమిలో సకల వసతులతో హైదరాబాద్ నగరం రాజధానిగా సిద్ధంగా ఉన్నది, ఆంధ్రప్రాంతానికి చెందినవారికి తెలంగాణలో స్థానికులను కాదని ఉద్యోగాలు ఇచ్చుకోవచ్చు, నదీజలాలను ఆంధ్రప్రాంతానికి తరలించుకొని వెళ్ళే అవకాశం ఉంటుంది. ఈ కారణంగానే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతమై తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.

ఎగువ రాష్ట్రాల వల్ల తెలంగాణకు నీటి సమస్య ఏర్పడినప్పుడు అంతర్ రాష్ట్ర వేదికలలోనూ, సుప్రీంకోర్టులోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి అనుకూలంగా ఏనాడూ వాదించలేదు. తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించాలని ఇంజనీర్లకు కానీ అధికారులకు కానీ న్యాయవాదులకు కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వలేదు. నదీజలాలలో తగిన వాటా దక్కకపోవడం, నియామకాలలో అన్యాయం జరగడం, నిధులు ఆంధ్రప్రాంతానికి తరలించడం వల్ల, నీళ్ళు, నియామకాలు, నిధులు అనే మూడు అంశాలపైనే ప్రధానంగా ఉద్యమం నడిచింది. చాలా మంది మృతి చెందారు. కొందరు పోలీసు కాల్పులలో చనిపోతే, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు.

## తెలంగాణ ఏర్పాటు రాజ్యాంగపరమైన అవసరం

తెలంగాణ రాష్ట్రం డిమాండ్ వెనుక రాజ్యాంగపరమైన ఆవశ్యకత ఉన్నదని జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలను అధ్యయనం చేసినప్పుడు గుర్తించింది. నాడు నల్సార్ విశ్వవిద్యాలయంలోప్రొఫెసర్ గా పని చేస్తున్న మాడభూషి శ్రీధరాచార్యులు జస్టిస్ శ్రీకృష్ణకు సమర్పించిన పత్రంలో లేవనెత్తిన ముఖ్యమైన అంశాలపైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి (శ్రీకృష్ణ), లా విశ్వవిద్యాలయం కులపతి (నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రణబీర్ సింగ్) అనేక ప్రశ్నలు అడిగారు. రాజ్యాంగం ప్రకారం అంతర్ రాష్ట్ర నదీజలాల వివాదాన్ని రాష్ట్రం మాత్రమే ప్రస్తావించగలదని ప్రొఫెసర్ శ్రీధరాచార్యులు సమర్పించిన పత్రంలో గుర్తు చేశారు. సుప్రీంకోర్టులో కేసు వేయడానికి జురిస్ డిక్షన్(పరిధి) కూడా రాష్ట్రానికి మాత్రమే ఉంటుంది. అప్పుడు తెలంగాణ ఒక ఉపప్రాంతం మాత్రమే కనుక కృష్ణా,గోదావరి నదీజలాల వివాదాల ట్రిబ్యూనళ్ళ తలుపు తట్టడానికి, సుప్రీంకోర్టు, హైకోర్టులకు వెళ్లడానికి కూడా అర్హత లేదు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నదీజలాల వాటా రాకుండా చేస్తున్నా, తెలంగాణకు ద్రోహం జరుగుతున్నా, ఆంధ్రప్రదేశ్ పక్షాన ట్రిబ్యునల్స్ కు ఉన్నత న్యాయస్థానాలకు వెళ్ల వలసిన ఆంధ్రపాలకులు, ఆ రాజ్యాంగ బాధ్యత నిర్వర్తించలేదు. రాష్ట్రంలో కీలకమైన ఒక ఉపప్రాంతం తీవ్రంగా నష్టపోతూ అన్యాయానికి గురవుతున్నా, కనీసం తాగునీళ్లు లేకపోయినా, వలస కూలీల సరఫరా కేంద్రంగా తెలంగాణ జిల్లాలు రంగారెడ్డి, మహబూబ్ నగర్ మారుతున్నా, మౌన ప్రేక్షక పాత్ర పోషించారు. ఇంత జరుగుతున్నా ప్రశ్నించే అధికారం తెలంగాణకు లేకుండా పోవడం వల్ల కనీసం అడిగే అధికారం కోసమైనా ప్రత్యేక రాష్ట్రం అవసరమయింది.

ఎగువ రాష్ట్రాలు అన్యాయం చేస్తున్నప్పటికీ ఆ విషయాన్ని అంతర్ రాష్ట్ర వేదికలపైన కానీ, సుప్రీకోర్టులో కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తావించలేదు. కనీసం విమర్శించలేదు. హామీలు ఇవ్వలేదు. వారు తెలంగాణ ప్రయోజనాలను గాలికి వదిలేసి ఉమ్మడి రాష్ట్రంలో నదీజలాలను తమ ప్రాంతానికి తరలించుకోవడంపైనే దృష్టిపెట్టారు. అందుకే, కోర్టులు, ట్రిబ్యూనల్ వంటి వివాద పరిష్కార వేదికల ముందు కనీసం అడగడానికైనా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఒక అనివార్యమైన రాజ్యంగ అవసరంగా మారింది.

ఎగువ రాష్ట్రాలు నదీజలాలను అధికంగా వినియోగించుకుంటే ప్రశ్నించే అధికారం రాష్ట్రాలకు మాత్రమే ఉన్నది. మామూలు న్యాయస్థానాల పరిధిని తొలగించి ట్రిబ్యూనళ్ళకు మాత్రమే విచారణాధికారం ఇచ్చారు. నదీజలాల వివాదంపై కోర్టుకు లేదా ట్రిబ్యునల్ కు వెళ్లే హక్కు రాష్ట్రానికే ఉన్నప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో రాష్ట్రం కూడా ముందు దావా వేయడానికి వీల్లేదు. ముందుగా ట్రిబ్యునల్ కు వెళ్లాలి. ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డు (తీర్పు)ను సమీక్షించమని హైకోర్టు, సుప్రీంకోర్టు వంటి న్యాయస్థానాలను కోరుతూ పిటిషన్ వేయవచ్చు. మనదేశంలో రాజ్యాంగం ప్రకారం నదీజల వనరుల వినియోగానికి సంబంధించి రాష్ట్రాలు నిర్దుష్టమైన అధికారాలు కలిగి ఉన్నాయి. దీన్నే 'జల సమాఖ్య (వాటర్ ఫెడరేషన్)' అంటారు. తెలంగాణ ప్రాంతానికి విచిత్రమైన సమస్య ఉంది. ఈ నదులు తెలంగాణ ప్రాంతంలో ప్రవహిస్తాయి. కానీ గొంతు తడుపుకోవడానికి కానీ, పొలాలకు నీరు పెట్టుకోవడానికి కానీ స్వార్థపరులైన తెలంగాణేతర పాలకుల కారణంగా వీలులేకపోయింది. పూర్తిగా దోపిడీ. పారదర్శకత బొత్తిగా లేకపోవడం తెలంగాణ ప్రజల ఆగ్రహానికి హేతువు అయింది. ఇది తీవ్రమైన ఉద్యమానికీ, తెలంగాణ ఆవిర్భావానికీ దారితీసింది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం తెచ్చారు. రాష్ట్ర విభజన 2 జూన్ 2014 నుంచి అమలులోకి వచ్చింది.

## మూడో అధ్యాయం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తలెత్తిన సమస్యలు

### 2014 చట్టం కింద శిఖరాగ్ర మండలి (అపెక్స్ కౌన్సిల్)

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 కింద ప్రస్తావించిన శిఖరాగ్ర మండలి (ఎపెక్స్ కౌన్సిల్)లో కేంద్ర మంత్రిది కీలకమైన పాత్ర. ఆ మంత్రి రాష్ట్రాలలో ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నారో, ఏ పార్టీ అధికారంలో ఉన్నదో, ఆ పార్టీకి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి ఎటువంటి సంబంధాలు ఉన్నాయో అనే విషయాలు పరిగణనలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఉదాహరణకు కేంద్రంలో ఉన్న ఎన్ డిఏ (నేషనల్ డెమాక్రాటిక్ అలయెన్స్) ఒక రాష్ట్ర ప్రభుత్వంతో స్నేహంగా ఉంటే నీటి వనరుల విషయంలో మరో పక్షాన్ని అననుకూలమైన పరిస్థితిలోకి నెట్టవచ్చు. ఈ

నదీజల మండళ్ళ (రివర్ బోర్డులు) అధ్యక్ష స్థానంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కార్యదర్శి హోదా అధికారి ఉంటారు. వివాదంలో ఉన్న రెండు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు బోర్డు సభ్యులుగా ఉంటారు. ప్రతి మండలిలో ఒక సాగునీటి ఇంజినీరింగ్ నిపుణుడు లేదా నిపుణురాలిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఒకరు బోర్డు మెంబర్ – సెక్రటరీగా ఉంటారు. అంటే రెండు నదీ మండళ్ళలో కేంద్రం నియమించిన అధికారుల పెత్తనం ఉంటంది. ఈ బోర్డులపైన ఆధిపత్యం చెలాయించే ఎపెక్స్ కౌన్సిల్ కి కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షత వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలే రెండు రివర్ బోర్డులలో పనిచేసే అవకాశం ఉంటుంది. రివర్ బోర్డులలో, అపెక్స్ కౌన్సిల్ లో రాష్ట్రాలకు స్వయంనిర్ణయాధికారాలు నిండుసున్న. రెండుబోర్డుల, అపెక్స్ కౌన్సిల్ అధికారాలను వివరిస్తూ అనేక నియమాలు చేసినప్పటికీ వాస్తవ అధికారం మాత్రం కేంద్రమంత్రిదే. వివాదాల పరిష్కారానికి విస్తారమైన వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు కనిపిస్తుంది కానీ నిజానికి కేంద్ర ప్రభుత్వం చేతుల్లో అధికారాలన్నీ కేంద్రీకృతమై ఉన్నాయి. ఇది రాజ్యాంగం ఉద్దేశించిన రాష్ట్రాల సమాన సార్వభౌమ హక్కులకూ, స్వయం నిర్ణయాధికారాలకూ, స్వేచ్ఛకూ సంపూర్ణంగా భంగకరమైనది. రాజ్యాంగం ఒకటో అధికరణ నిర్దేశించినట్టు ఇండియా రాష్ట్రాల సమాఖ్య కావడానికి బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను పరిపాలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాగివేసుకోవడం సమాఖ్య వ్యతిరేక ధోరణి. అందుకనే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలు రాజ్యాంగం ప్రసాదించిన సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం. అవి రాష్ట్రాల అధికారాలను కేంద్రం కాజేయడానికి దోహదం చేసే విధంగా ఉన్నాయి.

## జస్టిస్ బ్రిజేష్ తిరస్కారం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా నది ప్రవహిస్తున్న నాలుగు రాష్ట్రాల మధ్య నదీజలాలను పునః పంపిణీ చేయాలన్న తెలంగాణ అభ్యర్థనను, పదవీకాలం పొడిగించిన జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ అంగీకరించలేదు. 2016 అక్టోబర్ లో జస్టిస్ బ్రిజేష్ కుమార్ నాయకత్వంలోని ట్రిబ్యూనల్ కొన్ని కీలకమైన వ్యాఖ్యలు చేసింది. అవి:

1. పునర్వ్యవస్థీకరణ చట్టం (ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం,2014) లోని 89వ సెక్షన్ లో నది ప్రవహిస్తున్న నాలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల పంపిణీ కొత్తగా చేయాలని ఎక్కడా లేదు.
2. ఆ సెక్షన్ లో నీటి పంపిణీ విషయం కాదు కదా తెలంగాణ అన్న మాట కూడా ప్రస్తావించలేదు.
3. ఏయే ప్రాజెక్టులకు నీరు కేటాయించాలో 89వ సెక్షన్ పేర్కొనలేదు. ఇదివరకటి ట్రిబ్యూనళ్ళు ఏ ప్రాజెక్టులకు నీరు కేటాయించాయో ఆ ప్రాజెక్టులకు మాత్రమే నీరు కేటాయించడం గురించి ప్రస్తావించింది.
4. కృష్ణ బేసిన్ ఆవల ఉన్న ప్రాంతాలలో నదీజలాలను వినియోగించుకోవడం చారిత్రక కారణాల వల్ల సరైనదే.
5. కృష్ణ బేసిన్ కు వెలుపల ఉన్న రాయలసీమకు అందుకే కృష్ణా నదీ జలాలు పొందే హక్కు ఉంది.
6. విభజన తర్వాత ఏర్పడిన రెండు రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) అవిభక్త రాష్ట్రానికి కేటాయించిన వాటానే పంచుకోవాలి. అంతకంటే ఎక్కువా కాదు, తక్కువా కాదు.
7. నీటి కేటాయింపులో తప్పులు జరిగాయి కనుకనే, నీటి పంపిణీ సమానంగా జరగలేదు కనుకనే ఉమ్మడిరాష్ట్రాన్ని విభజించారన్న తెలంగాణ వాదన సరికాదు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో ఈ అంశం పదేపదే ప్రస్తావించింది. కానీ పునర్వ్యవస్థీకరణ బిల్లు లక్ష్యాలూ, కారణాలూ (ఆబ్జెక్టీవ్స్ అండ్ రీజన్స్) అంటూ చేసిన ప్రకటనలో ఈ కారణం లేనేలేదు.
8. ‘‘తెలంగాణ ప్రజల ప్రజాస్వామ్యయుతమైన, రాజకీయపరమైన ఆశలనూ, ఆశయాలనూ నెరవేర్చడానికే అవిభక్త రాష్ట్రాన్ని విభజించారు కానీ అసమానంగా నదీజలాలు పంపిణీ చేసినందుకు కాదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందనే వాస్తవాన్నీ, దానికి ప్రత్యేకంగా దాని వాటా నదీజలాలు కేటాయించవలసిన అవసరాన్నీ గుర్తించడానికి నిరాకరిస్తూ లోగడ బచావత్ ట్రిబ్యూనల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నీటి వాటానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రాజెక్టులవారీగా కేటాయిస్తానని దురదృష్టవశాత్తు వివాదాన్ని 17 ఏళ్ళుగా వింటున్నబ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్

తీర్మానించింది. కనుక నాలుగు రాష్ట్రాల (తెలంగాణ సహా) నదీజలాలను తిరిగి పంపిణీ చేసే అవకాశాలు లేవు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన చారిత్రక కారణాలను గుర్తించేందుకు ట్రిబ్యూనల్ గుడ్డిగా నిరాకరించింది. రావలసినదానికంటే తక్కువ నీటి వాటా రావడంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నష్టపోతున్నది.

## నదీ నిర్వహణ మండళ్ళు (రివర్ మేనేజ్ మెంట్ బోర్డ్స్)

తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఈ రెండు మహానదుల జలదోపిడీ మాత్రం ఆగలేదు. తెలంగాణ రాష్ట్రాన్ని 2014లో ఏర్పాటు చేసినప్పుడే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో రెండు రివర్ మేనేజ్ మెంట్ బోర్డులను ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. మాటవరుసకు బోర్డులను 2014లోనే ఏర్పాటు చేసినప్పటికీ వాటి పరిధిని కేంద్రం దాదాపు ఏడేళ్ళపాటు నిర్ణయించకుండా అంతులేని అలసత్వం ప్రదర్శించింది. జలదోపిడీ జరుగుతోందంటూ ఆరోపణలు చేసుకోవడం, వివాదాల పైన వాదులాడుకోవడం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య యథావిధిగా సాగుతూనే ఉన్నాయి. వివాదం కొనసాగుతోంది.

## పునఃకేటాయింపునకై డిమాండ్

తెలంగాణ 2014 నుంచి ప్రత్యేక రాష్ట్రం కనుక నదులు ప్రవహిస్తున్న ప్రాంతానికి దామాషాగా నదీజలాలలో వాటా కోసం తమ ప్రభుత్వం డిమాండ్ చేయాలని ప్రజలు సహజంగానే కోరుకుంటున్నారు. కృష్ణానది అరవై శాతం తెలంగాణలో ప్రవహిస్తున్నప్పుడు కృష్ణానదీజలాలలో యాభై శాతం కంటే తక్కువ ఎందుకు రావాలి? రాజ్యాంగం 14వ అధికరణ ప్రకారం సమాన భాగస్వామ్యం, సమానత్వం అనే మౌలికాంశాల దృష్టిలో తలకాయ ఉన్నవారు ఎవరైనా అడిగే ప్రశ్న ఇది. 21వ అధికరణ కింద జీవించే హక్కు ఆధారంగా ఆర్టికిల్ 14 కింద రాష్ట్రాలకు, రాష్ట్రాల ప్రజలకు నదులలో సమాన సూత్రం ఆధారంగా నీటి వాటా హక్కు ప్రాథమికమైనవే అయినా జీవన హక్కు అమలు కావాలంటే నీరు ప్రాథమిక అవసరం అనే మాట నిజమే అయినా, జల వివాదాన్ని కేవలం ట్రిబ్యునల్ మాత్రమే విచారించాలని, ఆర్టికిల్స్ 21, 14 ఉల్లంఘన అయినా సరే సుప్రీంకోర్టు కూడా ఆ వివాదాలు విచారించకూడదనే అసంగతమైన వాదనలు

దురదృష్ట వశాత్తూ తలెత్తుతున్నాయి. ఈ వాదాలు రూల్ ఆఫ్ లా అనబడే సమన్యాయ సూత్రానికి పూర్తిగా భంగకరం. ఈ రెండు నదులు ప్రవహిస్తున్న మొత్తం నాలుగు రాష్ట్రాల మధ్య నదీజలాలను తాజా లభ్యతలను అంచనా వేసి జనాభా, నదీ పరీవాహ ప్రాంతపు ప్రాతిపదికపై తిరిగి కేటాయించాలన్న డిమాండ్ కు ఉన్న న్యాయమైన నేపథ్యం ఇది.

తెలంగాణకు 2014కు ముందు తనకు జరిగిన అన్యాయం గురించి ఎలుగెత్తే అవకాశం లేకపోయింది. ఇప్పుడు ఏమైంది? 15 జులై 2021న జారీ చేసిన గెజెట్ నోటిఫికేషన్ ద్వారా నదులపైన అధికారాన్ని ఢిల్లీకి అప్పగించి నీటికోసం బొచ్చె పట్టుకొని వేచి ఉండమని కేంద్రం చెబుతోంది. దీనికి ఆంధ్రప్రదేశ్ సంతోషంగా అంగీకరించింది. తెలంగాణ లాంఛనప్రాయంగా వ్యతిరేకించింది.

## నాలుగో అధ్యాయం: 15 జులై 2021న విడుదలైన అన్యాయమైన గెజెట్ నోటిఫికేషన్

న్యూఢిల్లీ నుంచి జలశక్తి (నీటి వనరులు, నదుల అభివృద్ధి, గంగానది పునరుజ్జీవనం శాఖ)మంత్రిత్వశాఖ 15 జులై 2021న ఎస్.ఓ.2842 (ఇ) నంబరు గల గెజెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దాన్ని అమలు చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (2014) నిర్దేశించిన విధంగా, రెండు రాష్ట్రాలలో నీటివనరుల యాజమాన్యం సమర్థంగా జరిగే రీతిగా పనులు చేసేందుకు నదుల మండళ్ళ (రివర్ బోర్డులు) ను బలోపేతం చేయడంలో ఈ ప్రకటన (నోటిఫికేషన్) చాలా బాగా తోడ్పడుతుందని ప్రెస్ ఇన్ ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) విడుదల చేసిన ప్రభుత్వాధికారిక ప్రకటన పేర్కొన్నది. రెండు రాష్ట్రాల ప్రజలకు సమానంగా ప్రయోజనాలు చేకూర్చే క్రమంలో బోర్డులకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ మనస్పూర్తిగా సహకరిస్తాయనీ, సహాయం చేస్తాయనీ కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తున్నదని ఇందులో పేర్కొన్నారు.

కానీ, చట్టనియమాలకు అతీతమైన అక్రమ అడ్డగోలు ఆదేశాలూ, పూర్తి నిషేధాలూ, పైపెచ్చు హెచ్చరికలూ ఈ గెజెట్ ప్రకటన నిండా ఉన్నాయి. నదులపైన రెండు రాష్ట్రాలకూ ఉన్న అధికారాలను గెజెట్ నోటిఫికేషన్ ద్వారా

కేంద్ర ప్రభుత్వం తీసివేసుకుంటున్నది. సమానంగా పంపిణీ చేయడానికి కానీ, న్యాయం చేయడానికి కానీ, నదీజలాల వాటాలో తెలంగాణకు ఇంతవరకూ జరుగుతూ వచ్చిన అన్యాయాన్ని తొలగించడానికి కానీ ఏదైనా వ్యవస్థ ఉన్న దాఖలా గెజెట్ ప్రకటనలో లేదు. కేంద్రం నుంచి మొత్తం వందకు పైగా ప్రాజెక్టులకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలే ఆరు మాసాలలోగా అనుమతులు తెచ్చుకోవాలని గెజెట్ ప్రకటన పేర్కొన్నది. లేకపోతే ఆ ప్రాజెక్టులన్నీ పని చేయడం నిలిపివేయాలట. వాటిలో కొన్ని పూర్తిగా నిర్మాణం జరిగినా సరే పని చేయకూడదట. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నీ ఎక్కడివక్కడే నిలిపివేయాలట. దీనివల్ల ఆర్థిక పరిణామాలు ఏమైనా సరే గెజెట్ ప్రకటన అమలు జరిగి తీరవలసిందేనట. శ్రీశైలం లెఫ్ట్ కెనాల్, నక్కలగండి రిజర్వాయర్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రెండు దశలూ, పాలమూరు – రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ఢిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, భక్తరామదాసు ప్రాజెక్టు, తుమ్మిళ్ళ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రెండో ఫేజ్, రామప్ప – పాకాల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మొదలైనవి కనీసం 21 ప్రాజెక్టులు తెలంగాణలో ఉన్నాయి.

రెండు బోర్డులు పనిచేయడానికి వీలుగా ప్రతి రాష్ట్రం బోర్డుకు రూ.200 కోట్ల వంతున (మొత్తం రూ. 400 కోట్లు) చెల్లించుకోవాలని కూడా కేంద్ర గెజెట్ ఉత్తర్వు స్పష్టం చేసింది. సిబ్బందినీ, అధికారులనూ, ఫైళ్ళనూ, వాహనాలనూ వెంటనే బోర్డులకు అప్పగించాలనీ. బోర్డుల ఉత్తర్వులనూ, అపెక్స్ సంస్థ ఆదేశాలను ధిక్కరిస్తే జరిమానా చెల్లించవలసి ఉంటుందని కూడా రాష్ట్రాలను ఈ కేంద్ర గెజిట్ ఉత్తర్వు హెచ్చరించింది. వాస్తవానికి, పునర్విభజన చట్టం 2014 ప్రకారం అపెక్స్ కౌన్సిల్ ఇరుపక్షాలు వాదనలు విని కొత్త ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేయవలసి ఉంది. కాని ఈ విచారన ఎంత తొందరగా జరుపుతారో తెలియదు.

తెలంగాణలో పని చేస్తున్న మొత్తం 107 ఇరిగేషన్ ప్రాజెక్టులనూ బోర్డుల ద్వారా కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఇకమీదట కాలువలూ, బరాజ్ లూ, హెడ్ రెగ్యులేటర్లూ, లిఫ్ట్ ఇరిగేషన్ యూనిట్లూ, విద్యుదుత్పత్తి కేంద్రాలూ మొత్తం పూచికపుల్లతో సహా కేంద్రం నియంత్రణలోకి వెళ్ళిపోతాయి. కృష్ణా, గోదావరి నదుల బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ ఎంబి) అధికార పరిధిని

నిర్ణయించే పేరు మీద వెలువడిన ఈ కేంద్ర గెజెట్ ఉత్తర్వు ప్రకటన రాష్ట్రాలకున్న పరిధులనూ, అధికారాలనూ పూర్తిగా ఈ బోర్డులకు బదలాయించింది. రెండు రాష్ట్రాలలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులపైన (కృష్ణానదిపైన 35, గోదావరి నదిపైన 71 ప్రాజెక్టులూ) జరిగే పనులపైన రాష్ట్ర ప్రభుత్వాలకున్న అదికారాలను సైతం పూర్తిగా కేంద్రం లాక్కుంటున్నదని నియమాలు చదివితే తేలిపోతుంది. వింత ఏమంటే, కేంద్రం బోర్డుల నిర్వహణకు అయ్యే యావత్తు ఖర్చులనూ రాష్ట్రాల నెత్తిమీద వేయడం. బోర్డుల అధ్యక్షులుగా, సభ్యులుగా ఉండటానికి రెండు రాష్ట్రాల ఇంజనీర్లూ అర్హులు కారని ఈ కేంద్ర గెజెట్ ఉత్తర్వునోటిఫికేషన్ స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అదికారులను మాత్రమే నియమించేందుకు కేంద్రానికి అధికారం ఇచ్చింది ఈ గెజిట్ నోటిఫికేషన్. ఇక కృష్ణా,గోదావరి నదులు కేంద్ర ప్రభుత్వ బాబులకు (అధికారులకు) సొంతమైపోతాయి.  వారి రాజకీయ యజమానుల ఆదేశాలకు అనుగుణంగా వారి రాజకీయ అవసరాలకు తగినట్టు తమ ఇష్టారీతిగా ఈ అధికారులు వ్యవహరిస్తారు. అంటే రెండు పెద్ద నదులనూ రెండు రాష్ట్రాలకు చెందకుండా కేంద్రం తన స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర గెజిట్ ఉత్తర్వ ప్రకటన ఒక సాధనం అని స్పష్టం అవుతుంది.

## రాష్ట్రాలపైన ఆర్థిక భారం

రివర్ బోర్డులు తమ విధులను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా బోర్డుల ఖాతాలో చెరి రూ.400 కోట్ల చెప్పున మూలధనాన్ని జమచేయవలసిందిగా రాష్ట్రాలను ఆదేశించిందీ కేంద్ర ఉత్తర్వు. ఇంకా అదనంగా నిధులు కావాలని బోర్డులు కోరినట్లయితే అడిగిన పదిహేను రోజులలోగా రాష్ట్రాలు జమ చేయవలసి ఉంటుందని కూడా కేంద్ర గెజిట్ ప్రకటన తెలిపింది. రాష్ట్రాలు తమ నిధులనూ, సిబ్బందినీ, ఆస్తులనూ, చాలా కాలంగా భారీగా లక్షల కోట్ల నిధులు ఖర్చు చేసిన ప్రాజెక్టులనూ, నిర్వహణాధికారాలనూ, నియంత్రణనూ కేంద్రానికి అప్పగించాలన్నమాట. సమస్త అధికారాలనూ కేంద్రం తీసుకొని అన్ని ఆర్థిక భారాలను, రుణాల చెల్లింపుల బాద్యతలనూ, ఇతర జవాబుదారీ బాధ్యతలనూ, నష్టాలనూ రాష్ట్రాల నెత్తిమీద రుద్దింది.

ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి ఎటువంటి ఆదేశాలనైనా రాష్ట్రాలకు ఇచ్చే అధికారం బోర్డులకు ఉంటుందనీ, ఆ ఆదేశాలను రాష్ట్రాలు శిరసావహించాలనీ గెజెట్ చెబుతోంది. తమ ఉత్తర్వులు అమలు చేయించుకోవడానికి అవసరమైన సమస్త అధికారాలనూ గెజెట్ బోర్డులకు ఇచ్చింది. గెజెట్ నోటిఫికేషన్ ఇంకా ఈ విధంగా ఆదేశించింది: ప్రాజెక్టులో ఉన్న కర్మాగారాలు, యంత్రాలు, పరికరాలూ, స్టోర్సు, వాహనాలు అన్ని ఆస్తులూ కేఆర్ఎంబీకీ, జీఆర్ఎంబీకీ వెడతాయి. ఏ అంశమైనా కేఆర్ఎంబీకీ, జీఆర్ఎంబీకి పరిధిలో ఉన్నదా లేదా అనే అనుమానం, ప్రశ్న ఉత్పన్నమైతే కేంద్ర ప్రభుత్వ నిర్ణయమే ఖరారు (పేరాగ్రాఫ్ - ఓ). రాష్ట్రాలు తమ పరిధిలో ఉన్న ప్రాజెక్టులకు ఆరు మాసాలలోగా అనుమతులు సాధించాలి. అనుమతులు లేని ప్రాజెక్టులపైనా, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపైనా పనులను నోటిఫికేషన్ వెలువడిన రోజునే నిలిపివేయాలి. ఆరు మాసాలలో అనుమతులు సంపాదించకపోతే, ప్రాజెక్టులపైన పని శాశ్వతంగా ఆగిపోతుంది. ఇవి రెండు ప్రజాస్వామ్య రాష్ట్రాలనూ ఉద్దేశించి విడుదల చేసిన అప్రజాస్వామికమైన, పూర్తిగా నిరంకుశమైన, రాజ్యాంగవిరుద్ధమైన కేంద్ర అధికారిక ఆదేశాలు.

అనుమతులు లేని ప్రాజెక్టులు వెంటనే నిలిచిపోవాలని కూడా కేంద్ర గెజెట్ నోటిఫికేషన్ ప్రకటిస్తున్నది.  ఒక నిర్ణీత కాలంలో ఆ ప్రాజెక్టులను పూర్తి చేసే పూచీని కేంద్ర ప్రభుత్వం తీసుకోదు. కనీసం అనుమతులివ్వవలసిన అధికారం తన దగ్గరే ఉన్నా ఈ ప్రాజెక్టులను పరిశీలించి ఫలానా గడువులోగా అనుమతులిస్తాం అనిహామీ ఇవ్వాల్సింది పోయి, రాష్ట్రాలదే అందుకు బాధ్యత అని ప్రకటించడం దారుణం.  నదీప్రవాహిత ప్రాతానికి తగిన దామాషాలో రాష్ట్రాలకు నీరు దక్కే విధంగా వాటాలు పంచే బాధ్యతను కూడా కేంద్రప్రభుత్వం తీసుకోదట. ఈ నోటిఫికేషన్ విడుదల కావడానికి ముందు కాంట్రాక్టుకు సంబంధించిన ఎటువంటి ఆర్థిక లావాదేవీలు ఉన్నప్పటికీ, షెడ్యూల్డ్ -2 లో పేర్కొన్న విధంగా ప్రాజెక్టులూ, అటవంటి వాటితాలూకు కేసులు సుప్రీంకోర్టులో కానీ హైకోర్టులలోకానీ, ఇతరకోర్టులలో కానీ, ట్రిబూనళ్ళలోకానీ  ఉన్నట్లయితే వాటి ఫలితంగా వచ్చే ఆర్థిక భారం కలిగించే పరిణామాలను ఎదుర్కోవలసిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని

పేరాగ్రాఫ్ (జి) చెబుతోంది. ఆస్తులు చేతులు మారినప్పుడు వాటితో పాటు బాకీలూ, బకాయిలూ కూడా మారుతాయన్నది అందరికీ వర్తించే సామాన్య చట్టాలు స్పష్టం చేస్తున్న విషయం. సాధారణ వివేకం ఉన్నవారు అనుకునే విధానం. ఇది ప్రపంచ వ్యాప్తంగా అమలులో ఉన్న పద్ధతి. ఈ రూల్ ఆఫ్ లా కు విరుద్ధంగా ఈ కేంద్ర గెజిట్ ఉత్తర్వు జారీ చేశారు. ఆస్తులతోపాటు ఆదాయ వ్యయాలు, ఆర్థిక భారాలు చేతులు మారాలన్న సాధారణ న్యాయాన్ని ఈ ఉత్తర్వు పట్టించుకోవడం లేదు. అనుమతులు పొందిన ప్రాజెక్టులే కాదు పూర్తయినవీ, ఇంకా నిర్మాణంలో ఉన్న ఇతర ప్రాజెక్టులన్నింటినీ కృష్ణా గోదావరీ రివర్ బోర్డులు స్వాధీనం చేసుకొని జలశక్తి, కేంద్ర ప్రభుత్వ అధికారుల నియంత్రణకి అప్పగిస్తాయి.

## గెజెట్ నోటిఫికేషన్ అమలు చేయడంలో సమస్యలు

ప్రాజెక్టులు నిర్మించేందుకు తీసుకున్న రుణాల మాటేమిటని తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రశ్నించాయి. తెలంగాణలో గోదావరి, కృష్ణా నదుల యాజమాన్యానికి రూ.200 కోట్లు ఎందుకు ఖర్చు అవుతుందో చెప్పమని తెలంగాణ ప్రభుత్వం వివరాలు అడిగింది. ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయనీ, వాటికోసం ప్రాజెక్టు ఆస్తులను తాకట్టు పెట్టామనీ తెలిపారు. కేంద్రానికి ఆస్తులు బదిలీ చేసి అప్పులనూ, బాధ్యతలనూ రాష్ట్రాలు ఎట్లా భరిస్తాయి?

తాము లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం లభించేవరకూ నోటిఫికేన్లలో చెప్పినట్టు నీటి ప్రాజెక్టులను జీఆర్ఎంబీకి బదలాయించజాలమని తెలంగాణ ప్రభుత్వం చెప్పింది. గోదావరిపైన తీసుకున్న భారీ రుణాలను బ్యాంకులకు చెల్లించవలసి ఉండగా గోదావరి ప్రాజెక్టులనూ, ఆస్తులనూ జీఆర్ఎంబీకి బదలాయించడం ఎట్లా సాధ్యం? రుణాలు తీర్చే బాధ్యత ఎవరిది? గెజెట్ నోటిఫికేషన్లు రాజ్యాంగవిరుద్ధం కావడమే కాకుండా రాజ్యాంగం రెండు రాష్ట్రాలకూ ఇచ్చిన అధికారాలను కాలరాస్తున్నది. స్థానిక అవసరాలూ, సమస్యల గురించి ఏమీ తెలియని కేంద్రానికి తెలుగు రాష్ట్రంలో వసూలు చేసిన పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇచ్చి ఖర్చు చేయమని చెప్పాలా?

బోర్డులను నిర్వహించడానికి అంత భారీ మొత్తం ఎందుకని జీఆర్ఎంబీ అధికారులను రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు ప్రశ్నించడం సమంజసమే. ఈ ప్రశ్నలకు బోర్డు సమాధానాలు చెప్పవలసి ఉంటుంది. అంతే కాకుండా ఖర్చుల వివరాలు సైతం ఇవ్వవలసి ఉంటుంది. ప్రజాధనంపైన తన సార్వభౌమాధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెలాయించవలసి ఉంటుంది.

కేంద్ర పర్యవేక్షణలో కేంద్ర అదికారులు నిర్వహించే బోర్డులకు ప్రాజెక్టులను రాష్ట్రాలు అక్టోబర్ 14 నాటికి అప్పగించాలని గెజెట్ నోటిఫికేషన్ ఆదేశించింది. ఆ తేదీ నుంచి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకునేందుకు బోర్డులు సమావేశాలు నిర్వహిస్తున్నాయి.

రెండు రాష్ట్రాల ఉన్నతస్థాయి ఇంజనీర్లతో జీఆర్ఎంబీ సమావేశాన్ని నిర్వహించిందనీ, బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించడంపైన వారి అభిప్రాయాలు అడిగిందనీ మీడియాలో వార్తలు వచ్చాయి. గోదావరి నదిపైన 71 ప్రాజెక్టులు నిర్మించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట దగ్గర సంయుక్తంగా నిర్మించిన పెద్దవాగు ప్రాజెక్టును అప్పగించవలసిందిగా రెండు రాష్ట్రాల ఇంజనీర్లనూ జీఆర్ఎంబీ కోరింది. ఈ ప్రాజెక్టు కింద ఆంధ్రప్రదేశ్ లో 13,000 ఎకరాలూ, తెలంగాణలో 3,000 ఎకరాలూ సాగు అవుతాయి.

జీఆర్ఎంబీకి ప్రాజెక్టును బదిలీ చేస్తే ఉత్పన్నం కాగల రాజకీయ, న్యాయపరమైన సమస్యలు ఏమిటో తెలంగాణ ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని బోర్డుకు నీటిపారుదల శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి చెప్పారు. బోర్డు స్వాధీనం చేసుకున్న తర్వాత ప్రాజెక్టును ఎట్లా నిర్వహిస్తారో స్పష్టత లేదని ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ అధికారులు అన్నారు. ప్రాజెక్టు నిర్వహణలో ఫలానా బాధ్యతలు బోర్డు నిర్వహిస్తుందని నోటిఫికేషన్ లో ఎక్కడా పేర్కొనలేదని కూడ తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్దేశాన్నే గెజిట్ నోటిఫికేషన్ సవాలు చేసినట్టవుతోంది. నీరు, నిధులు, నియామకాలు అన్నవి తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన ముఖ్యమైన మూడు అంశాలు. ఈ మూడు అంశాలలో తనకు సముచితమైన వాటా దక్కలేదనే అసంతృప్తి కారణంగా తెలంగాణ ఉద్యమం దశాబ్దాలుగా సాగింది. ఉమ్మడి రాష్ట్రంలో దారి మళ్ళించిన నియామకాలూ, నిధుల

విషయంలో తెలంగాణ రాష్ట్రం చేయగలిగింది ఏమీ లేకపోయినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనైనా గోదావరి, కృష్ణా నదీజలాలలో న్యాయమైన వాటాదక్కించుకుంటామనీ, నిధులు పూర్తిగా నూటికి నూరు పాళ్ళూ రాష్ట్రంలోనే ఖర్చవుతాయనీ ప్రజలు భావించారు. కొన్ని వేల ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేసినప్పటికీ నియామకాల విషయంలో సంతృప్తికరమైన పరిస్థితి ఇప్పటికీ లేదు. తెలంగాణలో కృష్ణా, గోదావరి నదులు ప్రవహించే ప్రాంతానికి (నిడివికి) దామాషాగా నదీజలాలలో న్యాయమైన వాటా రావలసి ఉంది. నీటి పంపిణీకి సంబంధించిన వివాదం సద్దుమణికి ఉన్నది కాని పరిష్కారం కాలేదు. తెలంగాణ వాటా పెంచకుండానే రెండు రాష్ట్రాల మధ్య వాడివేడి ఆరోపణలు నడుస్తున్నాయి. ఈ వివాదాలను పరిష్కరించడానికి బదులు, తన సమస్య పరిష్కార కౌశలాన్ని ప్రదర్శించడానికి బదులు కేంద్రంరెండు అంతర్ రాష్ట్ర నదులను తన అధీనంలోకి తీసుకోవడం మేలని భావించింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య నదీజల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యూనల్ ను నియమిస్తుందేమోనని తెలంగాణ ప్రభుత్వం ఏళ్ళూపూళ్ళూ నిరీక్షిస్తూ వచ్చింది. సుప్రీంకోర్టులో ఉన్న పిటిషన్ ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంటే కొత్త ట్రిబ్యూనల్ ను ఏర్పాటు చేసే విషయం ఆలోచించగలమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం సిఫారసు మేరకు పిటిషన్ ని ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థించింది. న్యాయప్రవీణుల, న్యాయశాఖ సలహాలను తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యూనల్ ను నియమించే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

ఆంధ్రప్రదేశ్ కీ, తెలంగాణకూ మధ్య తీవ్రమైన వివాదం తలెత్తిందన్న మాట వాస్తవం.  వివాదాలను పరిష్కరించడానికి మాత్రమే కేంద్రానికి అధికారం ఉంటుందన్న రాజ్యాంగ సూత్రం కింద ఈ ఉత్తర్వు జారీచేసి ఉంటే, వివాద పరిష్కారానికి ఏం చేస్తారో చెప్పి ఉండాల్సింది. కాని ఆ వివాదాన్ని ఈ గెజెట్ నోటిఫికేషన్ ప్రస్తావించను కూడా లేదు. తెలంగాణకు ప్రథమంగా 2014లో రాష్ట్ర ప్రతిపత్తి వచ్చింది కనుక మొదటిసారిగా నదీజలాలలో తమ వాటా తేల్చాలనీ,

తిరిగి నాలుగు రాష్ట్రాల ప్రాతిపదికపై నదీజలాలను పంపిణీ చేయాలనీ కోరుతోంది. ఆ విధంగా కొత్త రాష్ట్రంతో సహా నదులు ప్రవహించే రాష్ట్రాలకు జల లభ్యత ప్రాతిపదికపై తాజాగా కేటాయించిన నీటి వాటాల ఆధారంగానే ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేయడమా లేదా అన్న నిర్ణయం ఉంటుంది. ఆ పని చేయకుండా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం వల్ల ఏర్పడిన ఉద్రిక్తతలను తగ్గించడానికే నదులను స్వాధీనం చేసుకుంటూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశామని కేంద్రమంత్రి వాదించడం వింతగా ఉంది. నిజానికి వివాదాన్ని పరిష్కరించే ఉద్దేశం కానీ ప్రయత్నం కానీ లవలేశమైనా లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను విభజించినప్పుడు తెచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం (2014) దఖలు పరచిన 'అధికారాల'తోనే నదులను రాష్ట్రాల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పడం విడ్డూరం.

## అయిదో అధ్యాయం: గెజెట్ నోటిఫికేషన్ అమలు జరిగితే ఎదురయ్యే విషమ పరిణామాలు

గెజిట్ నోటిఫికేషన్ లో పేర్కొన్న షరతులను అమలు చేస్తే సంభవించే పరిణామాలు కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విలయం సృష్టించే అవకాశం ఉన్నదనే విషయాన్ని ఒక సారి జాగ్రత్తగా పరిశీలించవలసిందిగా కోరుతున్నాం. అన్యాయమూ, రాజ్యాంగవిరుద్ధమూ అయిన గెజెట్ నోటిఫికేషన్ ను వెంటనే ఆపు చేయాలి.  లేకపోతే తెలంగాణ రాష్ట్రానికి అపారమైన నష్టం వాటిల్లుతుంది. కృష్ణా, గోదావరి నదులపైన ప్రాజెక్టుల నిర్మాణంకోసం ఇటీవలి కాలంలో ఖర్చు చేసిన రూ. 50 వేలకోట్లు వృధా కాగల ప్రమాదం ఉన్నది.

గెజిట్ నోటిఫికేషన్ లో పెట్టిన షరతులు అమలు జరిగితే కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది. ఉదాహరణకు ఆరు మాసాలలో అనుమతి తీసుకొని రాలేకపోతే నిర్మాణంలో ఉన్న  అన్ని ప్రాజెక్టులనూ వెంటనే  నిలుపుదల చేయాలన్న ఆదేశం కనుక అమలు జరిగితే సర్వనాశనం అవుతుంది. ప్రాజెక్టులకు అనుమతుల ఇవ్వడం అనేది పూర్తిగా దిల్లీలోని కేంద్ర ప్రభుత్వం విభాగాలపైన ఆధారపడి ఉంటుంది. ఆ విభాగాలపైన ఏ రాష్ట్ర ప్రభుత్వానికీ పట్టు ఉండదు. గెజిట్ ఆదేశించినట్టు అనుమతులు ఇవ్వమని అడిగితే కుదరదు. బచావత్ అవార్డు ప్రకారం మిగులు

నీరు ఆధారంగా కృష్ణానదిపైన ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. కానీ ఆ ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేయడం అనేది బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని ట్రిబ్యూనల్ సత్వరంగా, న్యాయంగా పని చేయడంపైన ఆధారపడి ఉంటుంది. అది ఆరు మాసాలలో జరిగే పని కాదు. కనుక ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం ఆపుచేయడం అన్నది అనివార్యంగా కనిపిస్తోంది. వ్యవసాయానికీ, ఆర్థికరంగానికీ, రాష్ట్ర పురోభివృద్ధికీ అనవసరమైన విఘాతం కలుగుతుంది. కనుక రాబోయే అనర్థం గురించి అవగాహన ఉండాలి. గెజెట్ నోటిఫికేషన్ అమలు జరిగితే ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందో కింద పేర్కొన్న వాస్తవాలు బలంగా నిరూపిస్తాయి.

**గెజిట్ నోటిఫికేషన్ వల్ల కలిగే నష్టాలు:**

1. నీరు లేక ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టు ప్రాంతం దెబ్బతింటుంది.
2. అవిభక్త మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలలో  నీటికి కటకట ఏర్పడుతుంది.
3. హైదరాబాద్ రాజధాని నగరంలో, అంటే తెలంగాణ సగభాగంలో, తాగునీరు సరఫరా ఉండదు.
4. ఈ ప్రాజెక్టులపైన రూ. 37,143  కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం అందులో కొంత భాగాన్ని అయినా వెనక్కు తీసుకునే అవకాశం లేదు, లేదా ఈ భారీ సొమ్ములో కొంత భాగాన్ని వ్యవసాయాభివృద్ధికి ఖర్చుచేసే అవకాశం ఉండదు. ఇటువంటి నిరంకుశమైన ఆదేశాలతో మూడున్నరకోట్లమంది తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసే అధికారం కేంద్రానికి లేదు.
5. కాలువల
6. కోసం, జలాశయాలకోసం  సేకరించిన లక్ష ఎకరాల భూమిని వినియోగించకపోతే తెలంగాణ ప్రభుత్వం సంక్షోభంలో పడిపోతుంది. ఈ భూమి రాష్ట్రానికి మోయలేని గుదిబండగా తయారవుతుంది.
7. ప్రాజెక్టులకోసం తీసుకున్న రుణాలను వడ్డీతో సహా తెలంగాణ ప్రభుత్వం తిరిగి చెల్లించాలి. ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా కాజేసింది కనుక ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి వాటి వల్ల వచ్చే నీటిని వ్యవసాయానికి వినియోగించే అవకాశం తెలంగాణ రాష్ట్రానికి ఉండదు.

ఈ కింద పొందుపరిచిన పట్టికలు గెజిట్ నోటిఫికేషన్ వల్ల తెలంగాణకు కాగల నష్టాన్ని అంకెల రూపంలో చూపిస్తున్నాయి. ఈ నష్టాన్ని భర్తీ చేయలేము. ఈ ప్రక్రియను తిరిగి వెనక్కి తిప్పలేము. ఇటువంటి అన్యాయమైన, చట్టవ్యతిరేకమైన, రాజ్యాంగబద్ధం కాని గెజెట్ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల వ్యవసాయానికి ఎంత నష్టం వాటిల్లుతుందో, పూర్తిగా నిర్మించిన ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే కలిగే ప్రయోజనాలు ప్రజలకు అందకుండా పోవడం వల్ల వచ్చే అపారమైన దుష్ఫలితాలు ఎటువంటివో ఊహించుకుంటే ఈ గెజిట్ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవడం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది. కనీసం దీని నష్టం ఎంత ఉంటుందో, ఎంతప్రమాదభూయిష్టమైనదో అంచనా వేయడానికీ, అర్థం చేసుకోవడానికి వీలుగా ఈ గెజెట్ నోటిఫికేషన్ ను కొంతకాలం సస్పెండ్ చేయాలి.

Table 1: The present position of Ongoing & Commissioned Projects

| s.no. | Category | **Contemplated Ayacut** | **Created Ayacut** | **Cost of project** | **So far Expenditure** | **Land Acquisition** | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | **Total** | **So far acquired** |
| 1 | Unapproved On-going Projects | 26.65 lakh Acres | - | Rs. 58,202 Crores | Rs. 28,409 Crores | 69,551 Acres | 43,872.1 Acres |
| 2 | Unapproved Commissioned Projects | 9.88 Lakh Acres | 7.53 Lakh Acres | Rs. 10,796 Crores | Rs. 8734 Crores | 72,449 Acres | 67,588 Acres |
| | **Total** | 36.53 Lakh Acres | 7.53 Lakh Acres | Rs. 68,998 Crores | Rs. 37,143 Crores | 1.42 Lakh Acres | 1.1146 Lakh Acres |

Table 2: The position of Unapproved Commissioned Projects:

| S.no | Project | Contemplated Ayacut | Created Ayacut | Cost of project | So far Expenditure | Land Acquisition | | Remarks |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | total | So far Acquired | |
| 1 | JAWAHAR NETTAMPADU LIS | 2 Lakh Acres | 1.42 Lakh Acres | Rs.2548 Crores | Rs. 2306 Crores | 24,742 Acres | 24,130 Acres | |
| 2 | KOILSAGAR LIS | 0.5 Lakh Acres | 0.36 Lakh Acres | Rs.567 Crore | Rs. 460 Crores | 3424 Acres | 3026 Acres | |
| 3 | MAHATMA GANDHI KALWAKURTHY LIS | 4.38 Lakh Acres | 3.1 Lakh Acres | Rs.5181 Crores | Rs. 3568 Crore | 22,283 Acres | 19,432 Acres | |
| 4 | AMRP LIS (Including LLC) | 3 Lakh Acres | 2.65 Lakh Acres | Rs. 2500 Crores | Rs. 2400 Crores | 22,000 Acres | 21,000 Acres | |
| | **Total** | 9.88 Lakh Acres | 7.53 Lakh Acres | Rs. 10,796 Crores | Rs. 8734 Crores | 72,449 Acres | 67,588 Acres | |


| S.no | Project | Contemplated Ayacut | Created Ayacut | Cost of project | So far Expenditure | Land Acquisition | | Remarks |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | total | So far Acquired | |
| 1 | JAWAHAR NETTAMPADU LIS | 2 Lakh Acres | 1.42 Lakh Acres | Rs.2548 Crores | Rs. 2306 Crores | 24,742 Acres | 24,130 Acres | |
| 2 | KOILSAGAR LIS | 0.5 Lakh Acres | 0.36 Lakh Acres | Rs.567 Crore | Rs. 460 Crores | 3424 Acres | 3026 Acres | |
| 3 | MAHATMA GANDHI KALWAKURTHY LIS | 4.38 Lakh Acres | 3.1 Lakh Acres | Rs.5181 Crores | Rs. 3568 Crore | 22,283 Acres | 19,432 Acres | |
| 4 | AMRP LIS (Including LLC) | 3 Lakh Acres | 2.65 Lakh Acres | Rs. 2500 Crores | Rs. 2400 Crores | 22,000 Acres | 21,000 Acres | |
| | **Total** | 9.88 Lakh Acres | 7.53 Lakh Acres | Rs. 10,796 Crores | Rs. 8734 Crores | 72,449 | 67,588 Acres | |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | Acres | | |

Table 3: The Position of Unapproved Ongoing projects

| **S.no** | **Project** | **Contemplated Ayacut** | **Cost of project** | **So far Expenditure** | **Land Acquisition** | | **Re rk** |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | **Total** | **So far acquired** | |
| 1 | PalamuruRanga Reddy lift irrigation scheme | 12.3 lakh Acres | Rs. 35,200 Crores | Rs. 17,771 Crores | 27,338 Acres | 25,981 Acres | |
| 2 | SRI RAMARAJU VIDYASAGAR RAO DINDI LIFT IRRIGATION PROJECT | 3.61 lakh Acres | Rs.6,190 Crores | Rs. 2,100 Crores | 16,345 Acres | 8841.1 Acres | |
| 3 | Srisailam Left Bank Canal Tunnel Scheme | 3 lakh Acres | *Rs*..3076 Crores | Rs. 2347 Crores | 3500 Acres | 3000 Acres | |
| 4 | Udaya Samudram Lift Irrigation Scheme | 1 lakh Acres | Rs.678 Crores | Rs. 410 Crores | 3,851 Acres | 1,510 Acres | |
| 5 | SITARAMA LIFT IRRIGATION PROJECT | 6.74 lakh Acres | Rs.13,058 Crores | Rs. 5,781 Crores | 18,517 Acres | 4,540Acres | |
| | **Total** | 26.65 lakh Acres | Rs. 58,202 Crores | Rs. 28,409 Crores | 69,551Acres | 43,872.1 Acres | |

## ఆరో అధ్యాయం: గెజెట్ నోటిఫికేషన్ ఎట్లా రాజ్యాంగవిరుద్ధమైనది?

15 జులై 2021న జారీ చేసిన గెజెట్ నోటిఫికేషన్ రాజ్యాంగవిరుద్ధమైనది, అన్యాయమైనది, ఏ మాత్రమూ సమర్థనీయం కానిది. ఎందుకంటే....

కోట్లాది ప్రజలకున్న జీవించే హక్కును నిరవధికంగా ఉల్లంఘిస్తున్నది ఈ గెజెట్ నోటిఫికేషన్. "మీకు జీవించే హక్కు ఉంది. అందుకోసం నీరు అత్యవసరం. కానీ జలవివాదాలను ట్రిబ్యూనళ్ళు మాత్రమే పరిష్కరించగలవు. సమానత్వం, జీవించే హక్కు భంగపడినా సరే సుప్రీంకోర్టు ఈ విషయాన్ని పరిశీలించరాదు," అనే నిబంధన అసంబద్ధమైనది. చట్టపాలన సూత్రానికి విరుద్ధమైనది.

## 14వ అధికరణ పూర్తిగా ఉల్లంఘున

అంతర్ రాష్ట్ర నదులు ప్రవహించే ఇతర రాష్ట్రాల కంటే రెండు తెలుగు రాష్ట్రాలనూ భిన్నంగా పరిగణిస్తున్నారు కనుక రాజ్యాంగంలోని 14వ అధికరణను ఉల్లంఘించినట్టు అవుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో ప్రాజెక్టులను కేంద్రం స్వాధీనం చేసుకోవడం వివక్షతో కూడిన చర్య.

## రాజ్యాంగాధికారాల పంపిణీ ప్రణాళిక ఉల్లంఘున

గెజిట్ నోటిఫికేషన్ మన రాజ్యాంగం అధికారాల పంపిణీకి అనుసరించి విధానాన్నే ఉల్లంఘించేదిగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మనం రాసుకున్న రాజ్యాంగం ప్రకారం, చట్టపరమైన అధికారాలను కేంద్రం, రాష్ట్రాల మధ్య పంచారు. **'నీరు' (వాటర్)** అనే మాటను రెండవ జాబితాలో 17వ అంశం

(ఎంట్రీ)గానూ, 'అంతర్ రాష్ట్ర నదులు' అనే మాటలను మొదటి జాబితాలో 56వ అంశంగానూ చేర్చడం అధికారాల విభజన చేశారు. వీటిపైన వేరే వివరణ లేదు.

నదులు ప్రవహించే రాష్ట్రాల మధ్య కానీ, నదీలోయ ప్రాంతాల(రివర్ వ్యాలీ)లో కానీ నదీజలాల వినియోగం గురించీ, పంపిణీ గురించీ, నియంత్రణ గురించీ ఏమైనా వివాదాలు తలెత్తినా, ఫిర్యాదులు వచ్చినా వాటి పరిష్కారానికి ప్రత్యేక చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు మన రాజ్యాంగం దఖలు పరిచింది. 262(1) అధికరణ కింద దాఖలైన వ్యాజ్యాలు, వివాదాలు, ఫిర్యాదుల విషయంలో సుప్రీంకోర్టు కానీ ఇతర కోర్టులు కానీ కలుగజేసుకోకుండా పార్లమెంటు నివారించవచ్చునని 262(2) అధికరణ చెబుతోంది.

**రెండో జాబితా (రాష్ట్రజాబితా)లో 17వ అంశం:** నీరు, అంటే నీటి సరఫరా, సాగునీటి సరఫరా, కాలువలు, డ్రైనేజీ కాలువలు, కరకట్టలు, నీటి నిల్వలు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలకు సంబంధించి **మొదటి జాబితాలోని 56వ** అంశంలోని నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి.

రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ కింద **మొదటి జాబితా (కేంద్ర జాబితా) లోని 56అంశం**. **అంతర్ రాష్ట్ర నదులు, నదీ లోయలు అభివృద్ధి చేయడానికీ, నియంత్రించడానికీ ప్రజాప్రయోజనాల ఆధారంగా కేంద్రానికి ఉండవలసిన అధికారాలను వివరించే చట్టాలు చేసే అధికారాన్నిపార్లమెంటుకు ఇచ్చింది.** మూడు జాబితాలలో శాసనాధికారాలను పంపిణీ చేయడం ద్వారా ఆ అంశాలపైన పాలనాధికారాలను ఇదే రీతిలోమన రాజ్యాంగం పంచింది. రాజ్యాంగం పంచిన శాసనాధికారం పరిధిలోనే రాష్ట్రానికి పాలనాధికారం కూడా ఉంటుంది.

రాష్ట్రజాబితాలో కేవలం నీరు, అంటే సదరు రాష్ట్ర పరిధిలో ఉన్న ఉపరితల జాలాలను మాత్రమే ప్రస్తావించారు. ఇతర రాష్ట్రంలో పుట్టి ప్రవహించే నదులు లేదా ఇతర రాష్ట్రాలలోకి ప్రవహించి సముద్రంలో కలిసిపోయే నదుల జలాల వినియోగానికి సంబంధించిన అధికారాల గురించి రాష్ట్రాల శాసనసభలు తమకు సంబంధించినంత వరకు చట్టాలు చేయవచ్చు. అంతర్రాష్ట్ర నదుల

విషయంలో అయితే, దేశానికి ఏది ప్రయోజనకరమని కేంద్రం భావించి చట్టాలు చేసిందో వాటిని అనుసరించిమాత్రమే రాష్ట్రాల అధికారాలు ఉంటాయి.

చట్టాలు చేయడానికి ఉన్న అధికారాలను పంపిణీ చేయడం అంటే పాలనాధికారాలను సైతం పంపిణీ చేయడమే. రాష్ట్రానికి పరిపాలనాధికారాలు ఇచ్చారు. దానికి సంబంధించిన శాసనాధికారాలు జాబితాలలో పొందుపరిచారు. అంటే, అంతర్ రాష్ట్ర జలవివాదాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తనకున్న అధికారాల పరిధి దాటి వెళ్ళజాలదు. గెజిట్ నోటిఫికేషన్ ను కేంద్రం తన అధికారాలు ఉల్లంఘించి ఇచ్చింది.

## రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతినే విధంగా కేంద్రానికి అధికారాలు కట్టబెట్టారు

ఈ నేపథ్యంలో కేంద్రం పాత్ర కీలకమైనది. అదే విషయాన్ని ఉమ్మడి జాబితాలోని 20 వ అంశం (ఎంట్రీ)లో (ఆర్థిక, సామాజిక ప్రణాళిక) పునరుద్ఘాటించారు. భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల నిర్మాణం సమయంలో వాతావరణ అనుమతులను కేంద్రం నుంచి రాష్ట్రాలు పొందాలని ఈ నిబంధన నిర్బంధం చేస్తుంది. కనుక ఏ చట్టం చేయకుండానే కేంద్రం నియంత్రణాధికారాన్ని గణనీయంగా అమలు పరిచే వీలుంది.

అదే సమయంలో, అంతర్ రాష్ట్ర నదీ జలాల విషయంలో క్రమబద్ధీకరించేందుకు చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నది. రాష్ట్ర జాబితాలోని 17వ అంశం ప్రకారం స్థానిక నదీ జలాల వినియోగం, సరఫరా, సాగునీటి సరఫరా, కాలువల ద్వారా నీరు పంపించడం, డ్రైనేజీ కాల్వల ద్వారా నీరు బయటికి పంపించడం, కరకట్టలు నిర్మించడం వంటి పనుల విషయంలో నిర్ణయాలు తసుకునే అధికారం రాష్ట్రాలకు ఉన్నది. **మొదటి జాబితాలోని 56వ అంశానికి** లోబడి రాష్ట్రాల అధికారాలు ఉండాలనేది పెద్ద పరిమితి. అధికారాల పంపిణీకి సంబంధించిన ఈ అస్పష్టత నీటి పంపిణీ విషయంలో సమస్యలు సృష్టించే అవకాశాలు ఉన్నాయి.

## నదీజలాల వివాదాలకు సంబంధించిన చట్టం

అంతర్ రాష్ట్ర నదీజల వివాదాలూ, నదీలోయలోని వివాదాలు పరిష్కరించే ప్రత్యేక ట్రిబ్యునల్ కోసం 1956 అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం (ఇంటర్-స్టేట్ రివర్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్ 1956) చేశారు. రకరకా వ్యాజ్యాలు (లిటిగేషన్) ట్రిబ్యునల్ కు వచ్చాయి. ట్రిబ్యునల్ కు వెళ్లవలసిన వివాదం ఏది అనే విషయంలో సుప్రీంకోర్టుకు అధికారం ఉంటుంది 'నీటి వివాదం అనగా నేమి (వాట్ ఈజ్ వాటర్ డిస్ప్యూట్)' అనే విషయం ట్రిబ్యునల్ కాకుండా సుప్రీంకోర్టుకే విచారణాధికారం ఉంటుందని సుప్రీంకోర్టు చెప్పింది. చట్టం మాత్రం అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల విచారణాధికారం సుప్రీంకోర్టు నుంచి తొలగించి ట్రిబ్యునల్ కు దఖలు పరిచింది. కానీ వివాదం నీటికి సంబంధించిందా కాదా అనే విషయంలో విచారించి తీర్పు చెప్పే అధికారం మాత్రం సుప్రీంకోర్టుకు ఉందని సుప్రీంకోర్టు చెప్పింది. నదీజలాల వివాదం తలెత్తి, ఏదైనా రాష్ట్రం  కోరితే కేంద్రం ఒక ట్రిబ్యూనల్ (న్యాయనిర్ణాయక వేదిక) ను నియమించాలి. ఈ ట్రిబ్యునల్ నియమించడానికి కేంద్రం జాప్యం చేస్తూ ఉంటుంది.  ట్రిబ్యూనల్ నియామకానికి దశాబ్దాల కాలం తీసుకున్న ప్రభుత్వాలూ ఉన్నాయి. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నదులను నియంత్రించి, అభివృద్ధి చేసే అధికారం కేంద్రానికి ఇవ్వడానికే 1956 నదుల పాలకమండళ్ళ చట్టం (రివర్ బోర్డ్స్ యాక్ట్, 1956) తెచ్చారు. నిర్దేశించిన విధంగా నదీపాలక మండలి (రివర్ బోర్డు) ఏదీ ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ చట్టం నిరుపయోగంగానే పడి ఉన్నది. రాష్ట్రాల సమసార్వభౌమాధికారం అంటే సమాఖ్య హక్కుల (ఫెడరల్ రైట్స్)కు ఈ చట్టం భంగం కలిగించేది. చట్టం లక్ష్యాలు, ఉద్దేశాలతో సహా చట్టం నిరుపయోగంగా ఉంది. నిపుణులతో కూడిన ప్రత్యేక ట్రిబ్యూనళ్ళను నియమిస్తారు కనుక జలవివాదాలను సుప్రీంకోర్టు విచారించడాన్ని ఈ చట్టం నిషేధించింది. ఒక రాష్ట్రం ఫిర్యాదు చేసినా, లేదా కోరినా కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యూనల్ ను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఏదైనా ఒక రాష్ట్రం జలవివాదాన్ని ఎత్తి చూపినప్పటికీ కేంద్రం ట్రిబ్యూనల్ నియామకానికి ఏళ్ళ తరబడి కాలయాపన చేస్తుంది. కొన్ని సందర్భాలలో వివాదాన్ని లేవనెత్తిన తర్వాత దశాబ్దాలకుపైగా ట్రిబ్యూనల్ నియామకం జరగలేదు.

కేంద్రం చేతులలో ఉన్న ఈ అధికారాలకు తోడు 1956 రివర్ బోర్డుల చట్టం కూడా కేంద్రానికి 'ప్రజాప్రయోజనాల'ను దృష్టిలో పెట్టుకొని నదులను నియంత్రించే అధికారాలు దఖలు పరిచింది. ఈ చట్టం ఆదేశించినట్టు రివర్ బోర్డుల నియామకం జరగలేదు కనుక అది మృతప్రాయంగానే మిగిలిపోయింది. ఒక వేళ అటువంటి బోర్డులను నియమించినట్లయితే రాష్ట్రాల సమాఖ్యసహితమైన హక్కులను తీవ్రంగా హరించినట్టు అవుతుంది. ఆ చట్టం అమలులో లేదు. కనుక ఆ చట్టం తీసుకురావడం వెనుక ఉద్దేశం కూడా అప్రకటితంగానే ఉండిపోయింది. నదులను స్వాధీనం చేసుకోవడం కేంద్రం అధికారాల పరిధిలోకి రాదు. అది కేంద్రానికి కూడా మంచిది కాదు.

## నదుల బిల్లులు

నదులను శుభ్రపరిచడానికీ, పునరుజ్జీవింపజేయడానికీ, నదులను పరిరక్షించడానికీ, జల వాటా వివాదాలు సామరస్యంగా పరిష్కరించడానికి సంబంధించిన బాధ్యతలేవీ విధించకుండా ఈ నదులకు నిర్వాహకులుగా, యజమానులుగా కొంతమంది దిల్లీ ఉన్నత స్థాయి అధికారులను నియమించి వారికి సర్వాధికారాలూ ధారాదత్తం చేసేందుకు రెండు నదుల బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రూపొందించింది. ఏ రోజైనా ఇవి చట్టాలుగా పార్లమెంటు ఆమోదం పొందే అవకాశం ఉంది. వివిధ ప్రాజెక్టులపైన పెద్ద ఎత్తున ధనాన్ని రాష్ట్రాలు ఖర్చు చేశాయి.  అటువంటప్పుడు వాటి తాలూకు ఆస్తులను రాష్ట్రాలకు చెందకుండా తానే స్వాధీనం చేసుకుంటూ కేంద్రం గెజెట్ నోటిఫికేషన్ ఎట్లా జారీ చేస్తుంది? రెండు లేదా మూడు రాష్ట్రాల మధ్య ఏదైనా వివాదం వస్తే ఆ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించడం మాత్రమే కేంద్ర ప్రభుత్వ బాధ్యత. రాజ్యాంగం అప్పగించిన ఈ కర్తవ్యాన్ని పట్టించుకోకుండా రాష్ట్రాల స్వయంనిర్ణయాధికారాలనూ, సార్వభౌమత్వాన్నీ హరిస్తూ నదులను కాజేయడం కుదరదు. రాష్ట్రాలకు  నదీజలాలను సక్రమంగా పంచేట్లుచేయమని రాజ్యాంగం, 2014 చట్టం నిర్దేశిస్తూ ఉంటే అక్రమంగా రెండురాష్ట్రాలలో ప్రవహించే మొత్తం నదులనే స్వాధీనం చేసుకుంటున్నది కేంద్రం.

నదులను కేంద్రం స్వాధీనం చేసుకోవడంతో ఇది అనివార్యంగా ఒక రాజకీయోద్దేశ పూరిత సమస్యగా మారింది. రాబోయే ఎన్నికల తర్వాత కూడా బీజేపీ అధికారంలో కొనసాగడానికి దోహదం చేసే నిర్ణయాలనే ఎన్ డీఏ ప్రభుత్వం తీసుకోవచ్చు. నోటిఫికేషన్లను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. కాని రాజ్యాంగం ప్రకారం తనకు న్యాయంగా రావలసిన నీటివాటా సాధించడానికి, స్వయంనిర్ణయాధికారాలను పరిరక్షించుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఏంచేస్తుందో చెప్పడం లేదు. కేంద్రాన్ని 'మేనేజ్' చేయమని రాజ్యాంగం చెబుతుంటే అది 'డేమేజ్' చేస్తున్నది.

## సమాఖ్య స్వభావానికి పూర్తిగా విరుద్ధం

కొత్త చట్టాలు కానీ పాత చట్టాలు కానీ అంతర్ రాష్ట్ర నదీజలాల వివాదాల పరిష్కారం చిక్కుముడి పడి సమాఖ్య స్వభావానికి విరుద్ధంగా వ్యవహారం మారిపోతోంది. వివాద పరిష్కారంలో నిరంతరం అస్పష్టత కొనసాగడం, సమాఖ్య హక్కులను ఉల్లంఘించడం కారణంగా అంతర్ రాష్ట్ర నదీ జలాల నిర్వహణ సంక్లిష్టమై కూర్చున్నది. నాలుగైదు రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తున్న పెద్ద నదుల విషయంలో కేంద్రం సానుకూలమైన, సామరస్యమైన ధోరణిని అవలంబించక తప్పదు. సమీకృత జీవావరణ వ్యవస్థనీ, నదీ జలాల పంపిణీనీ వ్యవస్థీకృతం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం కేంద్రం కర్తవ్యం కాగా చర్చల ద్వారా, ఫలాలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడానికి రాష్ట్రాలు సిద్ధంగా ఉండాలి. కేంద్రానికి సకారాత్మకమైన పాత్ర ఉద్దేశించడం సహేతుకం, ఆచరణాత్మకం. విస్తృత ప్రజాప్రయోజనాలు, జాతీయ ఆర్థిక ప్రయోజనాల రక్షణ అనే పదాల ద్వారా కేంద్రానికి ఎక్కువ అధికారాలు వస్తున్నాయి. కేంద్రం సమ్మతించినంతవరకూ రాష్ట్రాలు అంతర్రాష్ట్ర నదీజలాలను వినియోగించుకోవచ్చునని రాజ్యాంగం చెబుతోంది. ఒక రాష్ట్రం చిత్తం వచ్చినట్టు విచక్షణ లేకుండా నదీజలాలను వినియోగించుకున్నట్లయితే దిగువ పరీవాహక రాష్ట్రం ఫిర్యాదు చేస్తుంది. కేంద్రం జోక్యం చేసుకుంటుంది. దిగువ రాష్ట్రానికి ఒక్క చుక్క రాకుండా మొత్తం నీటిని తానే వాడుకోకుండా పై రాష్ట్రాన్ని క్రమబద్ధీకరించవచ్చు కాని ఒక రాష్ట్రాన్ని తన రాష్ట్రంలో ప్రవహించే అంతర్రాష్ట్ర నదీజలాలను అసలు

వినియోగించుకోకుండా పూర్తిగా నిరోధించి, తానే నిర్వహిస్తాననే అధికారం కేంద్రానికి ఉన్నదా అన్నది ప్రశ్న.

కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్య అధికారాల పంపిణీలో పాటించే సమతౌల్యాన్ని 15 జులై 2021న జారీ చేసిన గెజెట్ నోటిఫికేషన్ దెబ్బతీస్తుంది. నీరు అనేది రాష్ట్రానికి సంబంధించిన అంశం. ఉమ్మడి జాబితాలో ఉమ్మడి పరిధిని తప్పుగా అన్వయించి కేంద్ర ప్రభుత్వం నదులను స్వాధీనం చేసుకుంటున్నది. ఇందుకోసం 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని కూడా తప్పుగా అన్వయిస్తున్నది. కేంద్రానికీ, రాష్ట్రాలకు మధ్య పంపిణీ చేసిన సార్వభౌమత్యం ప్రకారం కూడా నదీజలాలపైన రాష్ట్రాలకు హక్కు ఉంటుంది. నీటి నిర్వహణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు హక్కులు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి కృష్ణ, గోదావరి నదులను కేంద్రం స్వాధీనం చేసుకోవడంతో జలసమాఖ్య సూత్రం నీరుగారిపోయింది. మర్యాదగా చెప్పాలంటే ఈ విధంగా నదులు స్వాధీనం చేసుకోవడం అక్రమం, అన్యాయం, అరాచకం.

## సర్కారియా కమిషన్ సిఫార్సులకు విరుద్ధం

అంతర్ రాష్ట్ర నదీ జలాల నియంత్రణలో, విచక్షణతో వినియోగించుకోవడంలో రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలలో తలదూర్చుతూ తనకున్న విశేషాధికారాలను కేంద్రం విరివిగా వినియోగించుకుంటున్నది. కేంద్రం జోక్యం ఎంతవరకూ అనుమతించవచ్చునో పార్లమెంటు స్పష్టం చేయాలని సర్కారియా కమిషన్ అభిప్రాయపడింది. అంతర్ రాష్ట్ర నదీజల వినియోగం అంశాన్ని రాష్ట్రాలజాబితాలోకి తీసుకురావడం వల్ల కేంద్రం అధికారాల పరిధి పరిమితమవుతున్నది. **1956 అంతర్ రాష్ట్ర నదీజలాల వివాదాల చట్టాన్ని** అనేక దఫాలు సవరించారు. **1956 నదీ మండళ్ళ చట్టాన్ని** తాకలేదు. అమలు చేయలేదు. మనకు రెండు రకాల అంతర్ రాష్ట్ర నదీ జల వివాదాలు ఉన్నాయి – దేశీయమైనవి. అంటే తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరీ జదీజలాల వివాదం అటువంటిదే. ఎగువన చైనాతో భారత్ కు ఉన్న వివాదాలు మరో రకమైనవి. అవి అంతర్జాతీయం. కేంద్రం చేతిలో కూడా లేదు. అంతర్ రాష్ట్ర నదీజల వివాదాల విషయంలో ఒక ప్రవీణుడి అధ్యక్షతన ఏర్పాటైన ట్రిబ్యూనల్ తీర్పు (అవార్డు) ఇస్తుంది. అటువంటి అవార్డును సుప్రీంకోర్టులో ప్రశ్నించే హక్కు

రాష్ట్రాలకు మాత్రమే ఉందని ఆ చట్టంలోని సెక్షన్ 5(3) ప్రకటించింది. ఈ నియమం లోపభూయిష్టమైనదో, అనవసరమైనదో కాదు. అన్యాయం జరిగిందని భావించే రాష్ట్రానికి తన గోడు వినిపించుకుని, న్యాయం చెప్పే హక్కు ఉండాలి. అందుకు తగిన వేదిక, విధాన ప్రక్రియ ఉండాలి. ట్రిబ్యునల్ కూడా న్యాయస్థానం లాగానే తీర్పు చెప్పే సంస్థ. అయితే అవార్డును పునః పరీక్షించాలని కోరే అధికారం గాని, తన అవార్డును సమీక్ష చేసే అధికారం గాని ట్రిబ్యునల్ కు లేదు. ఇరు వర్గాల మధ్య ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో రాజీ సంప్రదింపులు జరపడానికి ట్రిబ్యునల్ లో అవకాశం ఉండదు. వివాదాల పరిష్కారాలలో జాప్యం నివారించేందుకు 2002 లో అంతర్ రాష్ట్ర నదీజల వివాదాల చట్టాన్ని సవరించారు. ఈ సవరణ ప్రకారం అంతర్ రాష్ట్ర  నదీజల వివాదాన్ని ట్రిబ్యునల్ మూడేళ్ళలోగా పరిష్కరించాలి. ట్రిబ్యునల్ తీర్పుపైన సుప్రీంకోర్టు ఏడాదిలోగా తీర్పు చేప్పాలి. సుప్రీంకోర్టుకు ఇచ్చిన వ్యవధిని రెండేళ్ళకు పొడిగించవచ్చు. కాని సత్వర తీర్పులు సాధ్యం కాదు. కాల పరిమితులు నిలబడే అవకాశం లేదు. ఇక ఆవేశభరితమైన, అతి వివాదాస్పదమైన నదీ జలాల వివాదాలపైన ఏడాదిలోనో, రెండేళ్ళలోనో తీర్పు చెప్పడం అంత తేలిక కాదు.

**2014 చట్టాన్ని ఉల్లంఘించడమే కదా?**

రెండు నదులకు సంబంధించిన రెండు నదీయాజమాన్య మండళ్ళ (రివర్ మేనేజ్ మెంట్ బోర్డులు)ను నియుక్తం చేసి వాటికి పరిధులను కేంద్రం నిర్ణయించేందుకు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం అధికారాన్నిచ్చింది. కృష్ణా, గోదావరి నదుల నీటి వినియోగం, బోర్డుల పనితీరు పర్యవేక్షించేందుకు ఒక శిఖరాగ్రమండలి (అపెక్స్ కౌన్సిల్) ఏర్పాటు చేయాలనికూడా విభజన చట్టంలోని సెక్షన్ 84 ఆదేశించింది. అపెక్స్ బోర్డుకు అధ్యక్షుడుగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉంటే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ సభ్యులుగా ఉంటారు. వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించే బాధ్యత కేంద్రానికి అప్పగించడం విభజన చట్టం ఉద్దేశం.

సెక్షన్ 3 ప్రకారం అపెక్స్ సంస్థ విధులు ఏమంటే, 1) గోదావరి మేనేజ్ మెంట్ బోర్డు, కృష్ణా మేనేజ్ మెంట్ బోర్డు పనులను పర్యవేక్షించడం, 2) **గోదావరి,**

**కృష్ణానదీజలాలపైన కొత్త ప్రాజెక్టులేమైనా నిర్మించదలచినట్లయితే అటువంటి ప్రతిపాదనలను రివర్ బోర్డుల చేత పరిశీలింపజేసి, వాటి చేత సిఫార్సు చేయించి, సెంట్రల్ వాటర్ కమిషన్ చేత ఆమోదింపజేసి వాటికి అనుమతులు సేకరించిపెట్టడం** 3) విభజన ఫలితంగా ఏర్పడిన రెండు రాష్ట్రాల మధ్య నదీజలాల పంపిణీపైన విభేదాలు తలెత్తినట్లయితే చర్చల ద్వారా, ఒప్పందాల ద్వారా **సామరస్యంగా** పరిష్కరించడం, 4)కృష్ణానదీ జలాల ట్రిబ్యూనల్ పరిధిలో లేని తాజా వివాదాల్ని 1956 అంతర్ రాష్ట్ర నదీజలాల వివాదాల చట్టం కింద ఏర్పాటు చేయబోయే కొత్త ట్రిబ్యూనల్ కు నివేదించడం (1956లో 33వ చట్టం).

ఈ విధంగా 2014 చట్టం నిర్దేశిస్తే, రెండు మహానదులనూ స్వాధీనం చేసుకొనే అధికారం ఎక్కడినుంచి వచ్చింది? ఆస్తులన్నీ తీసుకుని బాధ్యతలన్నిటినీ రాష్ట్రాల నెత్తిన రుద్దాలని ఏ చట్టం, ఏ నియమం చెప్పింది? 2014 చట్టం ద్వారా పార్లమెంటు ఇచ్చిన ఆదేశాన్ని పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుంది. ఈ చట్టం 84వ సెక్షన్ కింద ఇచ్చిన అధికారాలు ఆధారంగా రెండు ప్రకటనలూ చేసినట్టు కేంద్రం చెప్పుకుంటున్నది. 2014 చట్టం ఇవ్వని విపరీత అదికారాలను ఆ చట్టం ప్రకారమే వాడుకుంటున్నట్టు కేంద్రం ఈ గెజిట్ ఉత్తర్వు లో చెప్పుకుంటున్నది.

2014 చట్టం 85వ సెక్షన్ మేరకు రివర్ బోర్డులను 2014లోనే ఏర్పాటు చేశారు. కేంద్రం ఎంపిక చేసిన ఇద్దరు కేంద్ర ప్రభుత్వానికి చెందిన కార్యదర్శి లేదా అదనపు కార్యదర్శి హోదా కలిగిన అధికారులు ఈ బోర్డులకు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. రెండు రాష్ట్రాలు ఎంపిక చేసిన వారు సభ్యులుగా ఉంటారు. కేంద్రం నియమించే సాగునీటి నిపుణుడు ఒకరు ఉంటారు. బోర్డు సభ్య-కార్యదర్శిగా కేంద్రం నియమించే చీఫ్ ఇంజనీరు హోదా కలిగిన కేంద్ర అధికారి ఉంటారు. ఈ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల సక్రమంగా జరుగుతున్నాదా లేదా పరిశీలించడం, ట్రిబ్యునల్ అవార్డులను అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవడం బోర్డుల విధ్యుక్త ధర్మం. కొత్త ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించి వాటి సాధ్యాసాధ్యాల పై అంచనా నివేదికలు అందజేయాలి.

2014 చట్టం, 87వ సెక్షన్ బోర్డుల అధికారపరిధి గురించి చెబుతుంది. 1. గోదావరి, కృష్ణానదీ జలాలకు సంబంధించిన హెడ్ వర్క్ లూ, బరాజులూ, డ్యామ్ లూ, జలాశయాలూ, నియంత్రణ, నిర్మాణాలూ బోర్డు పరిధిలోకి వస్తాయి. రాష్ట్రాలకి నీరు, విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి అవసరమైన సరఫరా తీగెలూ, నెట్ వర్క్ కూడా బోర్డుల పరిధిలోకి తెస్తూ కేంద్రం అడపాదడపా నోటిఫికేషన్లు జారీ చేయవచ్చు. 1956 అంతర్ రాష్ట్ర నదీజల వివాదాల చట్టం పరిధిలో ఏర్పాటు చేసిన ట్రిబ్యూనళ్ళు ఇచ్చిన అవార్డులకు అనుగుణంగా ఈ పని జరిగే విధంగా చూడాలి. 2. ప్రస్తావించిన ప్రాజెక్టుపైన బోర్డుకు సబ్ సెక్షన్ (1) కింద పరిధి ఉన్నదా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమైతే, దాన్ని నిర్ణయం కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలి. 2014 చట్టంలో బోర్డులకు ఇచ్చిన అధికారాలు ఇవి మాత్రమే.

నదుల బోర్డుల పరిధిని నిర్ణయించడం అనే సాకుతో బోర్డులు ఏర్పాటు చేసిన తర్వాత ఆరేళ్ళకు కేంద్రం నదులను స్వాధీనం చేసుకుంటూ 15 జులై 2021న గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పరిధుల నిర్ణయం, నియంత్రణ చేయవచ్చునని చట్టం 2014 అనుమతిస్తే మొత్తం ప్రాజెక్టులను ఆస్తులూ, అధికారాలతో సహా కేంద్రం స్వాదీనం చేసుకోవాలని కాదు. తమ ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న నదుల నిర్వహణకు రాష్ట్రాలకున్న హక్కులను పూర్తిగా లాక్కోవడానికి అనుమతించినట్టు కాదు. ఈ విధంగా కేంద్రం కేవలం తెలుగురాష్ట్రాల నదులపై ప్రాజెక్టులన్నీ తీసేసుకుంటూ పూర్తిగా ఆ నదులనే స్వాధీనం చేసుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాగతించడం నిజంగా దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. అంటే తమ సార్వభౌమాధికారాలను దిల్లీ చక్రవర్తికి పాదాక్రాంతం చేయడమేనని తెలుగు రాష్ట్రాలకు అర్థం కావడం లేదా. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాలను తిరిగి కేటాయించే విషయాన్ని పరిశీలించాలని డిమాండ్ చేసిన తర్వాత ఆ పని చేయకుండా, నదులను కేంద్రం ఎట్లా స్వాధీనం చేసుకుంటుందంటూ తెలంగాణ ప్రభుత్వం ప్రశ్నించింది.

**రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజల హక్కులు బలి కావలసిందేనా?**

ఇప్పుడు నదులు స్వాధీనం చేసుకోవడం రాజకీయ అంశం. ప్రజల నిజమైన హక్కులకు భంగం కలిగిందే విధంగా రాజకీయ దురుద్దేశాలతో నిర్ణయాలు

తీసుకోవడం జరుగుతోంది. ఎన్నికలలో విజయం సాధించడానికి ఏ నిర్ణయం ఉపయుక్తమో ఆ నిర్ణయాన్ని కేంద్రం కానీ రాష్ట్రాలు కానీ తీసుకునే అవకాశాలు ఉన్నాయి. గెజెట్ నోటిఫికేషన్ ను వ్యతిరేకిస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితి పాలనలోని తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం తన స్వయంనిర్ణయాధికారాలను పరిరక్షించుకునేందుకు నదీజలాలలో తనకు రావలసిన వాటాకోసం పోరాటం చేయవలసి ఉంటుంది.

## 'పబ్లిక్ ట్రస్ట్' సూత్రానికి విఘాతం

మన ఉనికికోసం నదులపైన ఆధారపడినాము కనుక నదులే మనకు జీవనాధారాలు. మన రాజ్యాంగంలో నీటి వనరులను **ప్రజావ్యవస్థ (పబ్లిక్ ట్రస్ట్)గా** పరిగణించారు. పలు రాష్ట్రాల గుండా ప్రవహించే నదుల నీటిని న్యాయబద్ధంగా రాష్ట్రాలకు పంచాలనే విషయంపైన 'ప్రజావ్యవస్థ' అనే సూత్రాన్ని పాటించడం మన విధి. అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలు కొత్త సమస్యలు సృష్టించకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలంటే న్యాయబద్ధంగా, సమత, సమానతా (ఈక్విటీ అండ్ ఈక్వాలిటీ) విధానాల ప్రకారం సమంగా రాష్ట్రాల మధ్య నీటిని పంచడం ఒక్కటే మార్గం. కేంద్రం జారీ చేసిన గెజెట్ నోటిఫికేషన్ మొత్తం నాలుగు రాష్ట్రాలలో రెండు రాష్ట్రాలను **'పబ్లిక్ ట్రస్ట్'** నిర్దేశించిన విధిని నిర్వర్తించకుండా నిరోధిస్తున్నది కనుక అది పబ్లిక్ ట్రస్ట్ సూత్రానికి విరుద్ధమైనది.

## ఏడో అధ్యాయం: ప్రార్థన

పైన చూపిన  కారణాల వల్ల గెజెట్ నోటిఫికేషన్ వంటి అక్రమమైన, చట్టవిరుద్ధమైన, రాజ్యాంగవిహితం కాని, ప్రమాదభూయిష్టమైన ఉత్తర్వులు అమలు చేస్తే కలిగే అపారమైన నష్టాల దృష్ట్యా గెజెట్ నోటిఫికేషన్ ను వెంటనే అమలు కాకుండా ఆపు చేయాలి. అప్పుడే సాధ్యమైనంత త్వరలో దాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంటుంది. అప్పుడే రాష్ట్రాలలో ఆర్థికరంగానికీ, వ్యవసాయరంగానికీ, తాగు నీటి రంగానికీ, ప్రజాసంక్షేమానికీ విఘాతం కలగకుండా నివారించగలుగుతాం.

ఇటువంటి పరిస్థితులలో రాజ్యాంగవ్యతిరేకమైన గెజెట్ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవలసిందిగా, రెండు నదుల నీటినీ రెండు తెలుగు రాష్ట్రాలకూ తిరిగి కేటాయించడానికి సత్వర చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్నీ, జలశక్తి మంత్రిత్వశాఖనూ ఆదేశించాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాం. మీ నిర్ణయం రాజ్యాంగబద్ధంగానూ, తెలంగాణకు అనుకూలంగానూ ఉంటుందని మనసారా ఆశిస్తున్నాం.

మీ విధేయులు

తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం